# పుణ్యభూమి



**ఈ పుణ్యభూమిలో పుణ్యం చేసుకుని పుట్టారనిపించేవారి సంఖ్య తక్కువ. మిగిలినవారు సుబ్బులులాగే కష్టాలను, బాధలను నిబ్బరంగా భరిస్తుంటారు.**

"సుబ్బులు జ్ఞాపకం ఉందా పూర్ణా?" అన్నది మాలతి గుత్తిలోంచి రెండు ద్రాక్షపళ్ళు తుంపి నోట్లో వేసుకుంటూ. అన్నపూర్ణ ఒక్కక్షణం ఆలోచించి "ఆఁ...ఆఁ...ఎర్ర సుబ్బులు కదూ!" అన్నది గుర్తుతెచ్చుకుంటూ. ముందుకి వంగి తనూ నాలుగు ద్రాక్షపళ్ళు తీసుకుని నోట్లో వడేసుకుంది.

చిన్ననాటి స్నేహితులు సుబ్బులు ప్రసక్తి రాగానే అన్నపూర్ణ, మాలతి నలభై ఐదు సంవత్సరాలు వెనక్కి వెళ్ళిపోయారు మాటల్లో.

"ఎంత అందంగా ఉండేదే! దాని ఒంటిమీద గొలుసు తెల్లని మెడమీద నీడ పడి మెరిసిపోయేది. పెద్ద జడ. ఎక్కడుందో ఇప్పుడు?" అన్నది అన్నపూర్ణ.

"ఇక్కడే ఉంది. వెళ్ళి చూద్దాం. సంతోషిస్తుంది. అసలది చిన్నప్పట్నుంచి అమాయకురాలేనే!" అన్నది మాలతి.

కాస్సేపు చిన్ననాటి స్మృతులు తెగ వేగంగా వాళ్ళిద్దరూ తవ్విపోస్తోంటే, వారి భర్తలు చలపతి, కుటుంబరావు చిరునవ్వులతో వింటున్నారు.

అన్నపూర్ణ, చలపతిరావు అమెరికాలో ఉంటారు. రెండేళ్ళకొకమారైనా ఏదో ఒక కారణాన వాళ్ళు భారతదేశం వస్తుంటారు. మాలతి అన్నపూర్ణకు గాఢమైన ప్రియమిత్రురాలు. ఆ దంపతులు ఢిల్లీ, బొంబాయి, మద్రాసు చుట్టుకొని, హైదరాబాద్ వచ్చి, మాలతి ఇంట్లోనే దిగుతారు. వాళ్ళకి ఇష్టమైనవన్నీ తినిపించి, కొనిపించి మాలతి సంతృప్తిపడుతుంది. టికెట్లు, ఆఫీసుపనులు చూసిపెట్టి ఎక్కడికి వెళ్ళాలంటే అక్కడికి కారు, డ్రైవరు ఏర్పాటుచేసి కుటుంబరావు సంతోషపడుతుంటాడు.

ఈసారి హైదరాబాద్ మకాంలో ముఖ్య కార్యక్రమం అన్నపూర్ణ కూతురు ఆడబడుచుగారి గృహప్రవేశానికి హాజరుకావడం. వాళ్ళని ఆశీర్వదించి తమ వంతు చదివింపులు ఇచ్చిరమ్మని అమెరికాలోని కూతురు పురమాయించింది.

"రేపు మీరు బేగంపేటలో గృహప్రవేశానికి వెడతారుగా, వచ్చేటప్పుడు సుబ్బులు ఇంటికి వెడదాం" అన్నది మాలతి.

"నువ్వూ వెడుతున్నావా వాళ్ళతో? వాళ్ళు పిలిచారా?" అన్నాడు కుటుంబరావు, భార్య తెల్లవారగానే వాళ్ళతో వెళ్ళిపోతుందనే అనుమానంతో.

"పిలిచేదేమిటి? బంధుమిత్ర పరివార సమేతంగా అంటే అందులో మీరూ వస్తారండీ! రెండున్నర వేలు పెట్టి బట్టలు చదివిస్తున్నామా. నలుగురం వెళ్ళి తినివద్దాం, రండి. మంచి తెలుగు భోజనం పెడతారు" అన్నది నవ్వుతూ అన్నపూర్ణ.

మాలతికీ నవ్వు వచ్చింది. "పోవే! మీరు తెలుగు భోజనానికి ముఖం వాచిపోయారేమోగానీ, మాకేమిటే?" అని భర్తవంక తిరిగి, "మీరు రావద్దులెండి. నేను వీళ్ళతో వెళ్ళి సుబ్బుల్ని చూసి, సాయంత్రం వరకు కబుర్లు చెప్పుకుని వస్తాను" అన్నది మాలతి, మర్నాటి కార్యక్రమం నిర్ణయించేస్తూ.

అన్నపూర్ణ సోఫాలో జారగిలబడి కూర్చుని, ద్రాక్షపళ్ళు తినడం పూర్తిచేసి, తమలపాకులు లెక్క లేకుండా నమిలేస్తోంది. ఆమె ఫారిన్ చీర ఒంటికి సొగసుగా అతుక్కుని ఉంది. అరవైఏళ్ళు నిండి ఏడాది దాటింది. ఐనా ఆ వయసే తెలియనీయకుండా తలకి చిక్కని నల్లరంగు పూసుకుంది. ఖరీదైన కళ్ళద్దాల లోంచి కాటుక కళ్ళు తుమ్మెదల్లా అటూ ఇటూ చూపులను విసరుతుంటాయి.

భార్యవంక ఎంతో మురిపెంగా చూశాడు చలపతి. "ఓకే. మిమ్మల్ని అక్కడ దించేసి, మేమూ మా పనులమీద వెడతాం" అన్నాడు. కుటుంబరావు బాల్కనీలో నిలబడి, డ్రైవరుని కేకేసి, పొద్దున్న ఐదున్నరకల్లా రావాలని చెప్పాడు.

"నేనూ, పూర్ణా, సుబ్బులు ఒకరినొకరు అంటిపెట్టుకుని ఉండేవాళ్ళమండీ! వీళ్ళ ముగ్గుర్నీ ఒకడికే ఇచ్చి కట్టాలి అని అందరూ వేళాకోళం చేసేవారు. తెల్లారి లేవగానే అందరం ఒక ఇంట్లో పోగై ఆడుకునేవాళ్ళం. అంతులేని కబుర్లు" అని మళ్ళీ గతస్మృతులలోకి వెళ్ళింది మాలతి.


"వాళ్ళ అమ్మకి ఎంతో అపురూపమే అదంటే. గుర్తుందా! మనతోపాటు చిరుతిళ్ళు తింటుందేమోనని కాపలాకాస్తుండేది ఆవిడ. చిన్న సీసాల్లో మరమరాలు, అటుకులు, పటికబెల్లం పోసి ఉంచి కొసరి కొసరి పెట్టేది. సుబ్బులేమో మనతోపాటు బయటికి వచ్చి, సుబ్బయ్య హోటల్లో ఇడ్లెన్లు, పచ్చడి తినేసేది. కానీకి మూడు ఇడ్లెన్లు" అని అన్నపూర్ణ మరీ వివరాల్లోకి వెళ్ళిపోయింది.

"ఏమండోయ్ చలపతి గారూ! మీ ఆవిడ చిన్నప్పుడు జామచెట్లు, నేరేడుచెట్ల మీద ఉండేది ఎప్పుడూ. కింద పడితే కాలు విరుగుతుందే, ఎవ్వడూ పెళ్ళాడడు అని వాళ్ళ బామ్మ తిట్టిపోస్తుండేది. చివరికి ఒకసారి 'ఢా'మ్మని పడింది కూడాను" అని మాలతి పకపక నవ్వేసింది.

"అవునవును. అప్పుడు కాలు విరగలేదుగానీ, తలలోని స్క్రూలు రెండు జారిపోయాయి. అయినా, ఈ చలపతి ఆవిడకి పతిగా అవతరించే ఉన్నాడు కనుక పెళ్ళయిపోయింది" అన్నాడు చలపతి. అందరూ నవ్వుకున్నారు.

మరునాడు బేగంపేటలో గృహప్రవేశం, వ్రతం, భోజనాలు అన్నీ పూర్తయ్యేసరికి ఒంటిగంటైంది. కారు ఎ.సి.

చిత్రాలు: సర్సిం




కోడలు అత్తగారి వంక చూసింది. "మేమంతా చాలా చెప్పాం వెళ్ళమని. కానీ, చదివింపులని, ఇంకా ఏవేవో కావాలని కూర్చున్నది" అన్నది. సుబ్బులు తల వంచేసుకున్నది.

అయినా, బయట ఎండ మాడ్చేస్తోంది. "నేను ఇంటికి పోయి పడుకుంటాను" అన్నాడు చలపతి. అన్నపూర్ణ ఒప్పుకో లేదు. "కాస్సేపు మాతో ఉండా లంటే ఏమిటి బాధపడి పోతున్నారు?" అని సుబ్బు లింటికే దారిమళ్ళించింది.

మాలతి డ్రైవరుకి చిక్కడ పల్లిలోని సుబ్బులు ఇంటి గుర్తులు చెబుతోంది. "అసలు చాలా తమాషాగా కలును కున్నానే సుబ్బులుని. గోపాలాచారి అని మన వీధిలో ఆయుర్వేదం ఆచార్లుగారి అబ్బాయి ఉండే వాడు - గుర్తుందా?"

"ఆఁ...ఆఁ...సుబ్బులు పెంపుడుకుక్క. తోక ఒక్కటే తక్కువ ఆడించడానికి. దెయ్యంలా దానివెంట వెళ్ళి పోయేవాడు" అన్నది అన్నపూర్ణ. చలపతికి నవ్వొచ్చింది ఉపమానం వింటే.

"గోపాలాచారి కొడుకు పెళ్ళి అయింది. అక్కడ కలిశాను సుబ్బులుని. ఎడ్రెను తీసుకుని, మా రెండోదాని పెళ్ళికి పిలిచాను. కానీ, అది రాలేదు" అని మాలతి చెబుతుంటే, "చూడండి, ఇల్లు దాటిపోతున్నామేమో!" అన్నాడు చలపతి.



కోడలు వాళ్ళిద్దరికీ బొట్టు పెట్టింది. లోపలికి వెళ్ళ బోయి, వెనక్కి తిరిగి సుబ్బులుకీ పెట్టింది. "సమయానికి ఇంట్లో పండు ఫలం కూడా లేదు" అన్నది సుబ్బులు మెల్లిగా.

ఆ సందులో మేదర ఇళ్ళు. నేలమీద బుట్టలు పెట్టుకుని చేవలూ అవీ అమ్ముకునేవాళ్ళు. మారుతికారు పట్టడం కూడా కష్టంగా ఉంది.

"ఉండుండు. ఆ రావిచెట్టు దగ్గర చిన్న గుడి ఉందిగా! అక్కడ ఆపు" అన్నది మాలతి.

ప్రవహిస్తున్న మురుగునీరు దాటి, చిన్న అరుగుల పక్కగా నడుస్తూ మరీ ఇరుకుగా ఉన్న సందు చివరికి చేరుకున్నారు. చలపతి లోపలికి రానన్నాడు కానీ, రమ్మని బలవంతం చేసింది అన్నపూర్ణ.

గుమ్మందగ్గర నిలబడ్డ ఒకతను కారు, అట్టహాసం చూసి "ఎవరు కావాలండీ?" అన్నాడు. క్రాపు సరిచేసుకుని, కాలరు సర్దుకున్నాడు.

"సుబ్బులు - అదే - సుబ్బలక్ష్మిగారు" అన్నది మాలతి.

"ఆఁ...ఆఁ..ఉన్నది. మా అమ్మే!" అన్నాడు. అతను లోపలకు వ..., కానీ, వీళ్ళను వెంటరమ్మని ఆహ్వానించలేదు.

మాలతి చొరవగా లోపలకు అడుగువేసింది. అన్నపూర్ణ సందేహంగా ముందుకు నడిచింది. చలపతి గుమ్మందగ్గర ఉండిపోయాడు.

గదిలో రెండు కుర్చీలున్నాయి. మూలగా చాప ఉంది. మాలతి ఆ చాప తనే పరిచేసి, "రండి, కూర్చోండి" అన్నది. తను చాప మీద కూలబడింది.

ఆ అబ్బాయి, వెనకాల మరొక ఆమె, ఇంకా వెనకాల ఇద్దరు పిల్లలు వచ్చారు ఇంట్లోంచి. ఆమె వెనకాల సుబ్బులు వచ్చింది. వెలిసి, మాసిన చీరను ఒద్దికగా కప్పుకోవాలని ప్రయత్నిస్తూ, "మాలతీ, నువ్వా?" అన్నది.

"ఔనే! ఇదుగో, ఇదెవరో చూశావుటే?" అన్నది. సుబ్బులు అన్నపూర్ణ వంక పరీక్షగా చూసింది. అన్నపూర్ణ చిరునవ్వుతో, "చెప్పుకో చూద్దాం" అన్నట్టు చూసింది.

"పూర్ణా!" అన్నది. సుబ్బులు. దగ్గరకు వచ్చి పొదువుకుంది. క్రీములు పట్టించి నునుపుగా జారిపోయే అన్నపూర్ణ ఒంటికి, పనితో బండబారిన సుబ్బులు చేతులు గరుకుగా తగిలాయి.

"రండి, కూర్చోండి" అన్నది చాపను సవరించబోతూ.

సందేహంగా నిలబడిన భర్తను చూసి, "మా ఆయన్ని కూడా తెచ్చానే!" అన్నది అన్నపూర్ణ.

"కాసిని చల్లని మంచినీళ్ళు" అన్నది మాలతి. గోడనానుకుని కొంగుతో విసురుకుంది.

వంటింటి గుమ్మందగ్గర నిలబడిన ఆమె వంక చూసింది సుబ్బులు. ఆమె వచ్చినవారి పట్టుచీరలు, నగలు, కుర్చీలో కూర్చున్న ఆయన ఖరీదైన వేషం చూస్తోంది.

"మా కోడలు. వీడేమో రెండోవాడు. పెద్దబ్బాయి పిల్లలు వాళ్ళిద్దరూ" అని పరిచయం చేసింది సుబ్బులు.

"నేను కింద కూచుంటే లేవలేనే" అంటూ రెండో కుర్చీలో కూర్చుంది అన్నపూర్ణ. సుబ్బులు వెలితిగా నవ్వింది. తమ ఇంట్లో రెండే కుర్చీలు ఉన్నందుకు, స్నేహితురాళ్ళ పనివాళ్ళు కూడా కట్టుకోని మురికి పాత చీర కట్టుకున్నందుకు, చల్లగాలి కోసం ఫ్యాను లేనందుకు, వచ్చినవారిని వెర్రిముఖాలు వేసుకుని తనవారంతా చూస్తున్నందుకు - నవ్వినట్లుంది ఆ నవ్వు.

"పూర్ణ, వాళ్ళాయన అమెరికా దంపతులే. మాతృభూమి మీద, మనబోటి వాళ్ళమీద దయతలచి రెండేళ్ళకొకసారి ఎగిరివచ్చి వాలుతుంటారు. ఔను గానీ, అసలు నీ ముఖం చూడకూడదనుకున్నాను. మా అమ్మాయి పెళ్ళికి రాలేదేమిటి?" అన్నది మాలతి, ఎంతో చనువుగా సుబ్బులు జబ్బ పట్టుకుని.

"ఔను మాలతీ! నాకు చాలా జ్వరం వచ్చింది ఆ వేళ. రావాలనే అనుకున్నాను" అన్నది మెల్లిగా సుబ్బులు.

కోడలు నాలుగు స్టీలుగ్లాసుల్లో మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది. గుటగుటమని మాలతి తాగేసింది. అన్నపూర్ణ ఒక గుక్క తాగి గ్లాసు కిందపెట్టింది. చలపతి "వద్దమ్మా!" అన్నాడు.

కోడలు అత్తగారి వంక చూసింది. "మేమంతా చాలా చెప్పాం వెళ్ళమని. కానీ, చదివింపులని, ఇంకా ఏవేవో కావాలని కూర్చున్నది. వాళ్ళ అబ్బాయి కూడా చెప్పారు, అంత అభిమానంగా పిలిచినప్పుడు వెళ్ళకపోతే బాగుండదని" అన్నది. సుబ్బులు తలవంచేసుకుంది. అన్నపూర్ణ ఆమెవంక జాలిగా చూసింది. మాలతి ఆ మాటలేవీ విననట్లు "సుబ్బులూ! నిన్నటి నుంచి నేను, పూర్ణ మన చిన్ననాటి ముచ్చట్లు చెప్పుకొని ఎంత మురిసిపోయామో!" అన్నది. ఆమె మాటల్లో ఎంతో ఇష్టం వినిపిస్తోంది.

చలపతి కూడా నవ్వుతూ, "అవును సుబ్బలక్ష్మిగారూ! మా ఆవిడకు అంత జ్ఞాపకశక్తి ఉన్నదని నాకు తెలియదనుసుమండీ! ఒక్కొక్కసారి షాపులోకి వెడితే, నన్ను మర్చిపోయి బయటికి వచ్చి, తను ఒక్కత్తే కారెక్కి ఇంటికి వెళ్ళిపోతుంది" అన్నాడు.

ఈ జోకుకి సుబ్బులు కొడుకు నవ్వాడు. సుబ్బులు తలెత్తి చూసింది. నవ్వటం చేతకానట్లు ముఖంలో కదలికలు.

అట్లతద్దినాడు తెల్లారుఝామున లేచి, పండిన గోరింటాకు చేతులు చూసుకుని, వీధుల్లో పక్కీగీతల ఆట ఆడిన సంగతులు, గచ్చకాయలు పోతే వెతుకుతూ ఒకరినొకరు తిట్టుకున్న సంగతులు, పూలజడలు వేసుకొని, మంచం పట్టీలమీద తలలు పెట్టుకొని పడిన అవస్థలు - తనివిదీరా చెప్పుకున్నారు. ఈ కథలన్నిటిలో సుబ్బులున్నది. కానీ, సరదాగా నవ్వుతూ, గలగలమని తనతో మాట్లాడాలంటే, ఇప్పుడు కుదరటంలేదు - అని గుర్తించింది అన్నపూర్ణ.


కోడలు లోపలికి వెళ్ళింది. "బాబూ!" అని మరిదిని పిలిచింది. వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటుంటే మాలతి గమనించి, "ఓ కోడలమ్మా! మాకు కాఫీలు, టీలు మర్యాదలు చేయనవసరం లేదు. పొద్దుట్నుంచీ తిండే తిండి, ఎకసక్కెంగా" అన్నది.

అన్నపూర్ణ సుబ్బులునే తదేకంగా చూస్తోంది. ఆమె వెనక్కి తిరిగి కోడలి వంక చూసి, "ఫరవాలేదులే. పూర్ణ మా ఇంటికి ఇంతదూరం వచ్చింది. ఏమీ ఇవ్వకుండా....." అంటూండగానే చలపతి "మేము మళ్ళీ వస్తాం. ఇవ్వటికి వెడతాం. కుటుంబరావుగారు ఎదురు చూస్తుంటారు మాలతి గారూ!" అన్నాడు.

"పోనీ ఒక పని చేద్దాం. రేవు కారు పంపిస్తాను. పొద్దున్న వచ్చి సాయంత్రం వరకు ఉండు. భోంచేసి సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అన్నది మాలతి.

ఈ మాట వినగానే చలపతి లేచి, "వస్తామమ్మా! ఏమోయ్, నువ్వేం చేస్తున్నావు?" అని సుబ్బులు రెండో కొడుకు భుజంమీద చేయివేసి, బయటి గుమ్మంవరకు నడిచాడు.

అన్నపూర్ణ కూడా లేచి సుబ్బులు దగ్గరగా వచ్చింది. తనంత ఎత్తే అయినా, వంగిపోయి, పొట్టిగా కనపడుతున్న నేస్తంవంక ప్రేమగా చూస్తూ, "ఏమిటే, ఇంత పొట్టైపోయావు?" అని కోడలితో, "మీ అత్తగారు ఎంత అందగత్తో తెలుసా?" అన్నది. ఆ మాటలు విన్నదో లేదో గానీ సుబ్బులు సూటిగా కళ్ళలోకి కాకుండా, అందరి వంకా బెదురుగా చూస్తోంది.



మినుకుమనే కళ్ళతో చూస్తోంది సుబ్బులు. చలపతి రెండు చేతులతో నమస్కరించాడు. నీ ఆత్మాభిమానాన్ని మెచ్చేవారెవరు తల్లీ అన్నంత జాలిగా చూశాడు.

"రేవు తప్పకుండా రావే. మాట తప్పవుకదా!" అన్నది మాలతి. సుబ్బులు తల ఊపింది చిన్ననవ్వుతో, ముందువళ్ళు కూడా రెండు ఊడినట్లు చూసింది అన్నపూర్ణ. కోడలు వాళ్ళిద్దరికీ బొట్టు పెట్టింది. లోపలికి వెళ్ళబోయి, వెనక్కి తిరిగి సుబ్బులుకీ పెట్టింది.

"సమయానికి ఇంట్లో పండు ఫలం కూడా లేదు" అన్నది సుబ్బులు మెల్లిగా.

"రేవు నువ్వొచ్చి మాతో ఉంటే అదే పనసపండంత సంతోషం మాకు" అన్నది మాలతి నవ్వుతూ.

అందరూ బయటికి నడిచారు. సుబ్బులు కొడుకు కారువరకు వచ్చి సాగనంపి, నమస్కారం పెట్టాడు. పిల్లలు ముందుచెట్టుకింద చేరి కారుని పరీక్షిస్తున్నారు. సుబ్బులు అరుగుమీద నిలబడ్డది.

కారు కొంతదూరం వెళ్ళాక, "ఆవిడ రేపు రాదు, చూడు" అన్నాడు చలపతి.

"ఎందుకు రాదు? ఒక్కపూటైనా అత్తగారు వదిలిపోయింది చాలని తప్పకుండా బయటకు నెట్టుతుంది ఆ కోడలు" అన్నది అన్నపూర్ణ.

"వస్తుందే పాపం. దానికి మనమంటే చాలా ప్రేమ" అన్నది మాలతి. మరునాడు సుబ్బులుని తీసుకురావడానికి వెళ్ళిన కారు ఖాళీగా తిరిగి వచ్చింది. "ఆ అమ్మగారికి ఒంట్లోబాగా లేదటమ్మా" అని చెప్పాడు డ్రైవరు.

ఎందుకు రాలేదో అని అన్నపూర్ణ, మాలతి కొంచెంసేపు మీమాంసపడ్డారు. ఈలోగా అమెరికా నుంచి ఫోను రావడం, మరికొన్ని పనులు కూతురు పురమాయించడం - ఆ హడావిడిలో సుబ్బులు ప్రసక్తి మరుగునపడింది.

మరో నాలుగు రోజులకి వాళ్ళ ప్రయాణం దగ్గరపడింది. బట్టలషాపుకి వెళ్ళినప్పుడు కనకాంబరం రంగు జరీచీర కొన్నది అన్నపూర్ణ. "ఏమిటే! ఈ రంగు కట్టుకోవాలని మనసైందా కొంపదీసి?" అన్నది మాలతి.

"లేదే! వెళ్ళేటప్పుడు సుబ్బులుకి ఇస్తాను. దానికి ఈ రంగు చాలా ఇష్టం" అన్నది. కాసిని పువ్వులు, పళ్ళు దోవలో కొనుక్కొని సుబ్బులింటిదగ్గర దిగారు. చలపతి తాను దిగనని అలాగే కూచున్నాడు.

మాలతి, అన్నపూర్ణ లోపలికి వెళ్ళారు. కారు ఆగేసరికి ఒకావిడ చెట్టు దగ్గర తచ్చాడుతోంది.

"మీరు సుబ్బలక్ష్మమ్మ బంధువులా బాబూ?" అన్నది. చలపతి తల ఊపి, ఇంక సంభాషణ ఇష్టంలేనట్లు మరోవేపు చూడసాగాడు.

"మీరు బాగా ఉన్నోళ్ళుకదా! - ఆమెగారిని ఏదేనా శరణాలయంలో చేర్పించరాదూ! మేము సూడలేమయ్యా ఆమె బాధలు" అన్నది.

చలపతి చటుక్కున ఆమెవంక తిరిగాడు.

"వాళ్ళ అబ్బాయిలున్నారుగా! చూడరూ? ఆమె భర్త...." అంటూండగా -

"భర్తా బండలా? వేరే ఎవరితోనో ఉంటున్నాడు బాబూ! బాగా సంపాదిస్తున్నాడు కదా! ఆయన్నడిగి డబ్బెట్టుకురా అని కొడుకులు సుబ్బలక్ష్మను దండిస్తారు. కోడలైతే చీపురుకట్ట తిరగేసి, చావ బాదేస్తుంది బాబూ!" అని చేత్తో సైగలు చేస్తూ, "ఇంత ముద్దకి కూడా కట్టమే ఆమెకి. పండులాగుండేది. కాలిన వంకాయలాగా అయిపోయింది. ఇంత కసాయివోళ్ళుంటారా?" అని పొరుగింటి మనిషి చెబుతోంటే చలపతి గుండె బరువెక్కిపోయింది. నువ్వు చెప్పేది నిజమా అని అడగాలన్నా నోట్లోంచి మాట రాలేదు.

మాలతి, అన్నపూర్ణ నవ్వుకుంటూ బయటికి వచ్చారు. అరుగు దాటి ఇవతలకు వచ్చిన సుబ్బలక్ష్మి ముఖాన పెద్ద కుంకుమ బొట్టు, కొప్పులో పూలు. చలపతికి నమస్కారం పెట్టిందామె - ఎండిన వేళ్ళు దగ్గరగా చేర్చి. ఆమె నవ్వుకి చలపతికి గొంతులో ఏదో ఆవేశం పట్టేసింది. కారు దిగి, "మీ కోసం ఇంత కొట్టుకొని పోతున్నారు మీ స్నేహితులు. ఓ పది రోజుల పాటు మాలతిగారింట్లోనైనా ఉండండి" అన్నాడు. అలాగే అన్నట్లు మళ్ళీ నవ్వింది సుబ్బలక్ష్మి.

"ఓహోహో! మా ఇంటికి రావడం, పదిరోజులుండడం! ఎంత నీటో దీనికి!" అన్నది మాలతి.

మరీ మరీ సెలవుపుచ్చుకొని, తనివితీరా స్నేహితురాలి బక్కదేహాన్ని నిమిరి, కారు ఎక్కారు మాలతి, అన్నపూర్ణ. మినుకుమనే కళ్ళతో చూస్తోంది సుబ్బులు. చలపతి రెండు చేతులతో నమస్కరించాడు.

"అమ్మా! నువ్వు అభిమానవతివి. మొగుడు వదిలేసినా, కన్నబిడ్డలు చావగొట్టినా, తిండి లేక దేహం ఎండుతున్నా మిత్రులతో చెప్పుకోని నీ ఆత్మాభిమానాన్ని మెచ్చేవారెవరు తల్లీ!" అన్నంత జాలిగా చూశాడు.

సుబ్బులు నికృష్ట జీవితం గురించి తను విన్న సంగతులు గట్టిగా మింగేశాడు చలపతి. మరునాడు విమానమెక్కి ఢిల్లీ వెళ్ళేలోపు ఈ మాట నోటి చివరి వరకు వచ్చినా నిగ్రహించుకొన్నాడు.

విమానం పైపైకి పోతోంటే పచ్చని చెట్లు, గుట్టల్లాంటి కొండలు, నీలిగా నీటిచెరువులు కనుపిస్తోంటే - మాతృభూమిపైన మమకారం పెల్లుబికింది చలపతిలో. తన దేశంలో పెంపుడుకుక్కలను, గోవులను ప్రేమించే మనుషులున్నారు. దారినపోయే ముష్టివాళ్ళను పిలిచి ఆదరించి అన్నంపెట్టే మంచి వాళ్ళున్నారు. అకారణంగా దానధర్మాలు చేస్తూ, మానవత్వం చాటే మహనీయులున్నారు.

కానీ, చిన్న పిట్టలాంటి, అస్థిపంజరంలాంటి, ముడుతలు పడిన ముసలి తొక్కులాంటి అనాథను హింసించే కసాయి సంతానం కూడా ఉన్నారని తనకీనాడు తెలిసింది. ఆమెను తమతో తీసుకువెళ్ళి కడుపునిండా తిండి పెడతామంటే వస్తుందా? వైద్యం చేయించి, బలం తెప్పిస్తామంటే సంతోషిస్తుందా?

ఊఁహూఁ....ఎందుకూ కొరగాని దాపరికంతో, ఆత్మాభిమానంతో ఎదురుతిరిగే శక్తిలేని జీవచ్ఛవంలా, అనామకంగా మట్టిలో కలసిపోతుంది.

"ఏమిటండీ ఆలోచన?" అన్నది అన్నపూర్ణ.

"ఏం లేదు. మీ సుబ్బులుని గురించి" అన్నాడు తడిగొంతుతో.

"పోనీలెండి. ఒక్కసారి దాన్ని చూడగలిగాను చాలు" అన్నది ఆమె.

మరోసారి వచ్చినప్పుడు చూడగలనో, లేదో అనుకున్నాడు చలపతి. ■